


ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -346 శనివారం 25 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు ఫలప్రదం..

## తెలంగాణలో రోడ్డెక్కనున్న బస్సులు!

**సమ్మె విరమించేందుకు కార్మిక సంఘాల అంగీకారం**

**శనివారం ఉదయం నుంచి యథావిధిగా బస్సు సర్వీసులు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన భేటీ**

**అధికారికంగా వెలువడనున్న ప్రకటన**






**హైదరాబాద్,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు తెరపడనుంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి2లో...

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది**

**ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**



**కోల్‌కతాఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం**మిగతాది** 2లో...

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

**ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ ఎంపీలతో కలిసి బీజేపీలో విలీనం!**

**పార్టీ తన ఆశయాలకు దూరమైందంటూ చద్దా విమర్శలు**

**రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగింపే కారణమని ప్రచారం**



**ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా బీజేపీలో చేరనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. 2లో...

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

**రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷-టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు.**మిగతాది** 2లో...




# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం**

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**సీఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నం సంతాపం**




**హైదరాబాద్,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది.**మిగతాది** 2లో...

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

**వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం**

**ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్**

**అమరావతి,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో **మిగతాది** 2లో...



# ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్**

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి**




# నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

**కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి**

**తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు.**మిగతాది** 2లో...



# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

**10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు -డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం**

**హైదరాబాద్,ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్- అలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.**మిగతాది** 2లో...



# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

(మొదటి పేజి తరువాయి)

బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

---

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

---

# నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

(మొదటి పేజి తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

(మొదటి పేజి తరువాయి)

తనతో పాటు మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీలో విలీనం కానున్నారని చెప్పడం సంచలనం సృష్టించింది.ఈరోజు ఢిల్లీలో సీనియర్ ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "15 ఏళ్లుగా ఆప్‌కు అంకితభావంతో పనిచేశాను. కానీ ఒకప్పుడు అవినీతి నిర్మూలన నినాదంతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఇప్పుడు నిజాయతీ రాజకీయాలకు దూరమైంది. నేను సరైన వ్యక్తినే, కానీ తప్పుడు పార్టీలో ఉన్నాను. అందుకే పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను" అని వ్యాఖ్యానించారు.ఆప్‌కు రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉండగా, వారిలో మూడింట రెండొంతుల మంది తనతో పాటు బీజేపీ వైపు వస్తున్నారని చద్దా పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ క్రీడాకారుడు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ వంటి వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పార్టీలో రాఘవ్ చద్దా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన్ను రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి తొలగించి, ఆ స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ పరిణామం పార్టీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే చద్దా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పలు సవాళ్లను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ నాయకత్వానికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

(మొదటి పేజి తరువాయి)

ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

(మొదటి పేజి తరువాయి)

ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

# ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు ఫలప్రదం..

మొదటిపేజీ తరువాయి

దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నేతలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి.

శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం ఆర్టీసీ జేఏసీ నేతలతో సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలు, పెన్షన్లు, ఇతర ప్రధాన డిమాండ్లపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.జేఏసీ నేతలు ప్రస్తావించిన అంశాలపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ హామీతో జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సానుకూల పరిణామంతో ఆర్టీసీ సేవలు తిరిగి సాధారణ స్థితికి రావడానికి మార్గం సుగమమైంది. సమ్మె విరమణ



వార్తతో ప్రయాణికులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు.కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

**శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం**

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. స్థానిక ఆర్డీవో ఉమారాణి ఆయన మృతదేహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం



(మొదటి పేజి తరువాయి)

గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

---

# ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

## ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

**హైదరాబాద్‌ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# నర్సంపేటకు వెళుతుండగా, సబితా ఇంద్రారెడ్డి, వినోద్ కుమార్ అరెస్టు

**అరెస్టు చేసి రఘునాథపల్లి స్టేషన్‌కు తరలించిన పోలీసులు**

**పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు**

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**నర్సంపేటఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అరెస్టు చేశారు.

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారిని



రఘునాథపల్లి పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నర్సంపేట వెళుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనపూర్ పోలీసులు మార్గమధ్యంలో ఆపి, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇదిలా ఉండగా, నర్సంపేటలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకువెళ్లడానికి కార్మికులు ప్రయత్నించారు. డిపో వద్ద ఆయనకు నివాళులు అర్పిస్తామని వారు తెలిపారు. అయితే అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది.శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తరలించి, కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళులు అర్పిస్తామని చెబుతుంటే పోలీసులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు, కార్మికుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 22 ఏళ్లకు పైగా నర్సంపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న శంకర్ గౌడ్ మృతదేహానికి కార్మికులు డిపో వద్ద నివాళులు అర్పిస్తేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు.

# సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన



**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 24 (జర్నలి స్ట్ వార్త):**
గోపాల్పూర్ గ్రామంలో ప్రతిపాదిత విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ క్రమంలో విద్యుత్ డి.ఈ. గ్రామ శివారులోని స్థలాన్ని పరిశీలించారు. బోడగుట్ట సమీపంలో ఉన్న సుమారు 9 ఎకరాల పట్టా భూమిని పరిశీలించినట్లు సర్పంచ్ కర్రే లక్ష్మి బిక్షపతి తెలిపారు. ఆ ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో, అందరి సమీక్షలో స్థలాన్ని ఖరారు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ పరిశీలనలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాత బిల్లులపై సంతకాలు లేవు... కలెక్టర్‌కు విన్నవిస్తా

**తల్లాడ/, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**



గ్రామ పంచాయితీ పాత బిల్లులపై ఇప్పటివరకు సంతకాలు జరగకపోవడంతో మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోరనున్నట్లు తెలిపారు. తల్లాడ మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆయన మాట్లాడుతూ, 2023-24 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయితీ బిల్లులపై ప్రస్తుత సర్పంచ్, ఉప సర్పంచ్ ఇంకా సంతకాలు చేయలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాత సర్పంచుల బిల్లులను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, తమ గ్రామంలో మాత్రం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో బిల్లులు క్లియర్ చేసినప్పటికీ, తమ గ్రామ నోట్ ఫైల్‌పై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశాన్ని పలుమార్లు మండల పరిషత్ అధికారులకు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని విన్నవించనున్నట్లు కిరణ్ బాబు వెల్లడించారు.

## మన శ్రమతో రాజభవనాలు... మనకు నీడలేని దుస్థితి




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు మళ్లీ ప్రభుత్వం దృష్టికి చేరాయి. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సంఘం నాయకులు ఆయన నివాసంలో కలిసి తమ గోడును వినిపించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. రాజభవనాలు కట్టేది మేమే... కానీ మా జీవితాల్లో మాత్రం కనీస నివాసం కూడా లేదు" అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రమించి నిర్మిస్తున్న భవనాలే తమ సృష్టి అని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా సాగిన పోరాటాల ఫలితంగా అమలులోకి వచ్చిన 1996 చట్టం కార్మికులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చలేదని తెలిపారు. అనేక రాస్తారోకోలు, ఆందోళనల ద్వారా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి చట్టాన్ని సాధించామని గుర్తు చేశారు. అయితే గత పదేళ్ల పాలనలో ఆ చట్టం నిర్వీర్యమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ అమలు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, సంక్షేమ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని మంత్రి ను కోరినట్లు నాయకులు తెలిపారు.

# హక్కు కోసం పోరాటం

## - ఆత్మబలిదానాలు వద్దు

### ఆర్టీసీ కార్మికులకు దళిత హక్కుల పోరాట సమితి మద్దతు

**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**



ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న సమ్మెకు హనుమకొండ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి మద్దతు ప్రకటించింది. జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై తమ గళాన్ని వినిపిస్తామని, వారికి అండగా నిలుస్తామని తెలిపారు. కార్మికుల పొట్టకొట్టే విధానాలను ప్రశ్నించాలే గాని, ఆత్మహత్యలు చేయడం సరైన మార్గం కాదని హెచ్చరించారు. "మీ ప్రాణం పోతే నష్టపోయేది మీ కుటుంబమే తప్ప ప్రభుత్వానికి కాదు. మీ ప్రాణం అమూల్యం" అని అన్నారు. ఆవేశానికి లోనై ఆత్మహత్యలను ఆశ్రయించవద్దని, గతంలో పోరాడి సాధించిన హక్కులను గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆగదని, కార్మికులతో కలిసి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ కాలంలోనూ ఆర్టీసీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుత ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. తక్షణమే స్పందించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మాహుతిపై విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి రూ.1 కోటి పరిహారం, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

## కార్యాచరణలో సర్పంచ్ అంబాల రాజు





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ఇంద్రనగర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ అంబాల రాజు స్పష్టం చేశారు. గ్రామ సభలో మాట్లాడిన ఆయన, కాలానుగుణ మార్పులకు అనుగుణంగా యువతను సక్రమ దారిలో నడిపిస్తూ అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులతో సమన్వయం పెంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. గ్రామంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు దశలో ఉన్నాయని పేర్కొన్నారు. "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా రహదారుల విస్తరణ, మురుగు కాలువల నిర్మాణం, చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు, శుభ్రత చర్యలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు రహదారుల ఇరువైపుల పూల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పెంచి, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థుల నమోదు పెంచడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గబ్బిట స్వామి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలన్నీ అమలు చేస్తా..


### గ్రామానికి తాగునీటి భరోసా: సర్పంచ్



**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుస్తానని చింతలపల్లి సర్పంచ్ బొంకూరి రజిత స్పష్టం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా గ్రామంలోని రెండు బోర్లను మరమ్మతులు చేసి తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గ్రామంలో విశాలమైన రహదారులు, పారిశుద్ధ్యంపై చర్యలు చేపడుతున్నామని, తడిపొడి చెత్త వేరు చేసే విధానాన్ని వార్డ్ సభ్యులతో కలిసి అమలు చేస్తున్నామని వివరించారు. ప్రజలు నాపై నమ్మకంతో అవకాశం ఇచ్చారని, వారి ఆశలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటానని రజిత పేర్కొన్నారు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్య, ఉపసర్పంచ్ రాజేందర్, రవీందర్, వార్డ్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ఓటర్లు మాప్పింగ్ ప్రక్రియను వినియోగించుకోండి.

### -తాహశీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,ఏప్రిల్ 24.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల ప్రజలు భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమములో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష ఆదేశానుసరం మండలంలోని ఓటర్లు మీరు 2002 సంవత్సరములో ఏ ప్రాంతములో నివాసము ఉండి, ఓటు నమోదు చేసుకున్నారో దానికి సంబందించి 2002 సంవత్సరములో ఉన్న నియోజక వర్గం నెంబర్,పోలింగ్ కేంద్రం నెంబర్,క్రమ సంఖ్యను ప్రస్తుతం నివాసము ఉన్న ప్రాంతములో ఓటర్ మాప్పింగ్ చేసుకొనుటకు వివరములను తీసుకొని సంబందిత బూత్ స్థాయి అధికారిని సంప్రదించి వెంటనే ఓటర్ మాప్పింగ్ ప్రక్రియను పూర్తి చేయవలసినదిగా మండల తహసీల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## పరిశుభ్రతలో ప్రజా భాగస్వామ్యం అవసరం.

### -సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.

**బయ్యారం/,ఏప్రిల్ 24.(జర్నలిస్ట్ వార్త)**




ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో శుక్రవారం సర్పంచ్ గుగులోత్ శాంతికిషన్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశుభ్రత, పారిశుధ్యంపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటిని,వీధిని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహారించాలన్నారు. చెత్తను రోడ్లపై వెయ్యకుండా,చెత్తను తడి చెత్త,పొడి చెత్త వేరు చేసి పంచాయతీ వాహనంలో వెయ్యాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కోసం ప్రతిఒక్కరుగ్రామ సభలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలందరు ఇంటి పన్నులు సక్రమంగా చెల్లించాలని,నీటిని పొదుపుగా వాడాలని,గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములమవడానికి గ్రామసభలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు ప్రజల చేత ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమా, పెద్దినేని వెంకటేశ్వరరావు,నాయిని శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో ప్రజా భాగస్వామ్యశీ కోసమే గ్రామసభ.

### -సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్.

**బయ్యారం/,ఏప్రిల్ 24.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలం సింగారం గ్రామంలో గ్రామసభను సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించి,లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించి,గ్రామాభివృద్ధి అవసరాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామ స్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమని సర్పంచ్ సరస్వతి రాందాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమాదేవి,వార్డు సభ్యులు చూంచు అనిల్ కుమార్,చెరుకుపల్లి మనీషా,బాధవత్ లల్యా నాయక్, గుగులోత్ భద్రు నాయక్,బానోత్ సరిత,సపవత్ అనిత రాందాస్,గ్రామ నాయకులు చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి,సంతోష్,సురేష్,మహేష్,శ్రీను, వంశీ,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను దగ్ధం.



**బయ్యారం/,ఏప్రిల్ 24.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలంలోని కోయగూడెం పంచాయతీ పరిధిలో చేతి వచ్చే దశలో మొక్కజొన్న పంట గురువారం సాయంత్రం గాలి దుమారానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు సర్పంచ్ లింగ నాయక్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కోసం పూసం నాగేందర్ బాబు నాలుగు ఎకరాలు,పూసమ్ లక్ష్మయ్య,పూసం ఎర్రయ్య,భూక్య పెద్ద నరసింహ మొక్కజొన్న పంట పొలాల్లో కంకులు విరిసి పొలంలో ఉండగా గురువారం ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలికి పక్కనే ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో నిప్పురవ్వలు మొక్కజొన్న పంటపై పడి సుమారు ఆరు ఎకరాలలో సుమారు లక్ష అరవై వేల విలువైన మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. దగ్ధమైన పంట పొలాలను వ్యవసాయ అధికారి ఫయాజ్ పరిశీలించారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం వచ్చే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

# రైతు పోరాటం ఉధృతం.. కలెక్టరేట్ ముట్టడి






**ఖమ్మం,/ ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):** రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మహాధర్నా ఉధృతంగా సాగింది. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గర్జిస్తూ రైతులకు అండగా నిలిచారు.మొక్కజొన్న, వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయాంలో రైతుబంధు, బోనస్, రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు మద్దతు ఇచ్చామని, ప్రస్తుతం రైతు సంక్షేమం పట్ల నిర్లక్ష్యం నెలకొన్నదని విమర్శించారు.తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వరి, మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తాతా మధుసూదన్, పువ్వాడ అజయ్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర, కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

# బడి వాహనాల భద్రతపై కఠిన హెచ్చరిక

**జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు**





**సత్తుపల్లి/, ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు బడి వాహనాలను సంపూర్ణ భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి జే.ఎన్. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండదని హెచ్చరించారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కాకముందు, మే 15 తరువాత బడి వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలోపు అన్ని వాహనాలకు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి, రహదారి ప్రయాణానికి అనుకూలంగా ఉంచాలని యాజమాన్యాలకు సూచించారు.బ్రేకులు, టైర్లు, దీపాలు వంటి కీలక భద్రతా అంశాలు సరిగా లేని వాహనాలను నడిపితే వాటిని స్వాధీనం చేసుకోవడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల రక్షణే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని, వారి పనితీరుపై యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు గుర్రం కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఎలిశెట్టి నాసరయ్యతో పాటు వివిధ ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారిని ఘనంగా సత్కరించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి -తహసిల్దార్ వెంకటస్వామి**







**పర్వతగిరి/ ఏప్రిల్ 24(జర్నలిస్ట్ వార్త):** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని కొంకపాక, మూడెత్తుల తండా, కల్లెడ, ఏనుగల్లు, మాల్యా తండా, చింతనెక్కొండ గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సమైక్య కోశాధికారి స్వప్నతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తాలు, మట్టి, గడ్డి లేకుండా ప్యాడీ క్లీనర్ ద్వారా శుద్ధి చేసి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడుకు రూ. 2,389, కామన్ గ్రేడుకు రూ. 2,369 తో పాటు, సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ అందజేస్తుందని వివరించారు. నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, తూకాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు తక్కడపెల్లి శ్రీనివాస్, తోరి పద్మ కుమార్, గాదుదుల రమేష్, ఏపీఎం రాజీరు, సీసీలు కొమురయ్య, శ్యామ్సన్, దేవేంద్ర, ఎఫ్పీసీ సీఈఓ శ్రీనివాస్, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను

# ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

**-ఐఎఫ్ టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే.మదార్.**



**బయ్యారం/,ఏప్రిల్ 24. (జర్నలిస్ట్ వార్త)** గత మూడు రోజులుగా ఆర్టీసి కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే.మదార్ డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు సమ్మెకు ముందుగా 41రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని వినతి పత్రం ఇచ్చారు.అయినా ప్రభుత్వం ఏమి పట్టనట్టుగా వ్యవహరించింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసి ని ప్రభుత్వం లో విలీనం చేస్తామని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని వాగ్దానం చేసింది.కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా కార్మికులు 50 రోజులకు పైగా సమ్మె చేశారు.అయినా ఆనాటి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించుకుండా కార్మికులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి అనేకమంది కార్మికుల పైన తప్పుడు కేసులు పెట్టింది.నర్సంపేట డిపోలో డ్రైవర్ గా ఉద్యోగం చేస్తున్న శంకర్ గౌడ్ ది ఆత్మ హత్య కాదు ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అన్నారు.నర్సంపేట డిపోలో డ్రైవర్ గా ఉద్యోగం చేస్తున్న శంకర్ గౌడ్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని అందరూ చూస్తుండగా నిప్పంటించుకుని మరణించాడు.

ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించి ఉంటే శంకర్ గౌడ్ మరణించేవాడు కాదు.శంకర్ గౌడ్ మరణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి తన కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించి వారి కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఐఎఫ్ టీయు రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని మాదార్ అన్నారు.ఆర్టీసి కార్మికులు చేస్తున్న సమ్మెకు ఐఎఫ్ టీయు రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు ఇస్తుందని మదార్ అన్నారు.ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు

**మాదిగ హక్కుల పరిరక్షణ సమితి**



**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ ఈ విషయాన్ని వెల్లడించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందేనని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయాలని అన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వెంటనే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ కార్మికుల పోరాటానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఉపేందర్ మాదిగ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ డిమాండ్లు తీర్చాలి..: బీజేపీ హెచ్చరిక





**సత్తుపల్లి,/ ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సత్తుపల్లి బీజేపీ నాయకులు హెచ్చరించారు.డిమాండ్ల సాధన కోసం దీక్ష చేస్తున్న కార్మికులను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, శంకర్ గౌడ్ బలన్మరణం తీవ్ర విషాదమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళు లర్పించారు.ఈ నేపథ్యంలో పట్టణ అధ్యక్షుడు భాణావత్ విజయ్ నేతృత్వంలో బీజేపీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ణి వీరంరాజు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, వేతన సవరణ అమలు చేయాలని, కార్మిక సంఘాల ఏర్పాటుకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు.సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని, కార్మికులతో కలిసి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చీకటి వసంతరావు, డాక్టర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రికి నివాళి.. గ్రామంలో సందడి



**తల్లాడ,/ ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):** స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తికి ఆయన తనయుడు జక్కంపూడి రాము ఘనంగా నివాళులర్పించారు. అమెరికా నుంచి స్వగ్రామానికి వచ్చిన రాము గురువారం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కారును కొనుగోలు చేసిన సందర్భంగా విగ్రహం ఎదుట పూజారి చేత ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.రాము రాకతో గ్రామంలో సందడి నెలకొంది. యువకులు, మహిళలు ఆయనను ఆప్యాయంగా పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా వారితో సరదాగా ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో సోదరుడు జక్కంపూడి కిషోర్, డాక్టర్ రామకృష్ణ, నరసింహారావు, జక్కంపూడి రమేష్, అల్లిబాబు, పాపులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

**కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత నరసింహారెడ్డి ఉదారత**



**వర్ధన్నపేట/ఏప్రిల్ 24(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని కట్టమైసమ్మ నూతన ఆలయ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత కామిడి నరసింహారెడ్డి తనవంతు సహాయంగా రూ. 5 లక్షల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కౌన్సిలర్ సిలివేరు కుమారస్వామి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.వచ్చే నెల 7, 8 తేదీలలో కట్టమైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు వివరించారు. అనంతరం నరసింహారెడ్డిని శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. స్పందించిన ఆయన తక్షణమే ఆలయ నిర్మాణ నిమిత్తం రూ. 5 లక్షల చెక్కును చైర్మన్ సారంగపాణికి అందించారు. సొంత ఊరిపై మమకారంతో నరసింహారెడ్డి చేసిన ఈ ఆర్థిక సాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సమ్మెట శ్రీనివాస్, తుమ్మల శ్రీధర్, నేరేటి సమ్మయ్య, మైస వీరేందర్, పూజారి రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

## డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం బాధాకరం :ఆర్ఎస్పీ డిమాండ్



**పర్వతగిరి/ఏప్రిల్ 24(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి ఆర్టీసీ కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ డిమాండ్ చేసింది. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చేసుకోవడంపై ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మె ప్రస్తుతం విషాదఛాయల్లో చిక్కుకుందని, ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే కార్మికులు మనస్థాపానికి గురవుతున్నారని విమర్శించారు.

శంకర్ గౌడ్ మరణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని కుమార్ డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా కార్మికులు చేస్తున్న పోరాటాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. బలిదానాలు ఏ సమస్యకూ పరిష్కారం కావుపోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలి అని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, ఆర్టీసీ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడు

# యాకాంతానికి పరామర్శ




**వర్ధన్నపేట/ఏప్రిల్ 24(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల పరిధిలోని వేంకట్రావుపల్లి (బొక్కలగూడెం) గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుళ్ళ యాకాంతంను పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల యాకాంతంకు మైనర్ శస్త్రచికిత్స జరగడంతో ప్రస్తుతం ఆయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం ఆయనను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాకాంతం త్వరగా కోలుకుని తిరిగి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్ తదితరులు ఉన్నారు. ఈ పరామర్శలో గ్రామ సర్పంచ్ కుళ్ళ పావని, స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్మథనం.. ప్రాణాంతక డ్రగ్స్ కంటే

# ప్రమాదకరమైన నమ్మకద్రోహం

### - పతనమవుతున్న మానవ విలువలపై ఒక విశ్లేషణ



నమ్మకం... మనిషిని మనిషితో ముడివేసే ఒకే ఒక్క అదృశ్య దారం. సమాజమనే మహాసౌధానికి పునాది రాయి. కానీ, నేడు ఆ పునాది కదులుతోంది, ఆ దారం ముక్కలవుతోంది. "మోసం చేసే మనుషుల కంటే డ్రగ్స్ నయం అనే ఆవేదనభరితమైన నినాదం నేడు సామాజిక మాధ్యమాల్లో పెనుతుపానులా వ్యాపిస్తోంది. ఇది కేవలం యువతలో కనిపిస్తున్న తాత్కాలిక అసహనం కాదు, మానవ సంబంధాలు ఎంతలా దిగజారిపోయాయో చెప్పే ఒక చేదు నిజం. మత్తు పదార్థం శరీరాన్ని చంపితే, నమ్మకద్రోహం ఆత్మను ఛిద్రం చేస్తోంది.

**విషతుల్యమైన నమ్మకద్రోహం ఒక సామాజిక విశ్లేషణ**

డ్రగ్స్ లేదా మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయని, కుటుంబాన్ని రోడ్డున పడేస్తాయని అందరికీ తెలుసు. అందుకే ప్రభుత్వం వాటిపై నిషేధం విధిస్తుంది, సమాజం వాటిని అసహ్యించుకుంటుంది. కానీ, ఎదుటివారి నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి చేసే మోసం అంతకంటే ఘోరమైనది. డ్రగ్స్ అలవాటు నుంచి బాధితుడిని పునరావాస కేంద్రాల ద్వారా బయటకు తీసుకురావచ్చు. కానీ, ప్రాణ స్నేహితుడో, రక్తం పంచుకున్న వ్యక్తో వెన్నుపోటు పొడిస్తే ఆ గాయం జీవితాంతం మానిపోదు. అది బాధితుడి ఆత్మవిశ్వాసాన్ని, జీవించే ఉత్సాహాన్ని నీరుగారుస్తుంది. ఒక వ్యక్తి మోసపోతే ఆ ప్రభావం అతనితోనే ఆగిపోదు. అతను సమాజం పట్ల నమ్మకాన్ని కోల్పోతాడు. ఈ 'నమ్మక రాహిత్యం' ఒక అంటువ్యాధిలా సమాజమంతా ప్రబలుతుంది. చివరకు అత్యంత పవిత్రమైన బంధాలను కూడా అనుమానపు కళ్లతో చూసే దుస్థితి ఏర్పడుతుంది.

**ముసుగులో జరుగుతున్న మాయాజాలం**

నేటి ఆధునిక కాలంలో మోసం అనేది ఒక ప్రవృత్తిగా, కొందరి దృష్టిలో అది ఒక తెలివైన 'కళ'గా మారిపోయింది. స్వార్థమే పరమావధిగా బతుకుతున్న లోకంలో నైతికత అనే మాటకు నిఘంటువుల్లో కూడా చోటు లేకుండా పోతోంది. ఆస్తుల కోసం, అధికారం కోసం, విలాసాల కోసం కన్నవారిని, తోడబుట్టిన వారిని సైతం తప్పుదోవ పట్టించే ధోరణి నేడు సర్వసాధారణమైంది. డబ్బు ఇచ్చే మత్తులో బంధాల విలువ మసకబారిపోతోంది. ప్రేమ, స్నేహం అనే ముసుగులో అవతలి వ్యక్తి బలహీనతలతో ఆడుకోవడం, వారి భావోద్వేగాలను వాడుకుని వదిలేయడం నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. శరీరానికి తగిలే గాయం కంటే, మనసుకు తగిలే నమ్మకద్రోహపు గాయం ఎంతో లోతైనది.

**వ్యవస్థాగత లోపాలు - పరిష్కార మార్గాలు**

మత్తు పదార్థాలను అరికట్టడానికి నార్కోటిక్స్ విభాగాలు, కఠినమైన చట్టాలు ఉన్నాయి. మరి మానవ విలువలను కాపాడటానికి, నమ్మకద్రోహాన్ని అరికట్టడానికి ఏ చట్టం ఉంది ఏ జైలు శిక్ష వంచనను ఆపగలదు దీనికి మూలం మన ఆలోచనా విధానంలోనే ఉంది. నేటి విద్యావ్యవస్థ కేవలం ర్యాంకుల వేటలో పడింది. విద్యార్థులకు గణితం, విజ్ఞాన శాస్త్రం నేర్పిస్తున్నాం కానీ, నైతికత ను బోధించలేకపోతున్నాం. పాఠశాల స్థాయి నుంచే తోటి మనిషిని గౌరవించడం, నిజాయితీగా ఉండటం నేర్పాలి. వ్యక్తిగత మరియు వృత్తిపరమైన సంబంధాల్లో పారదర్శకత చాలా ముఖ్యం. ఏ బంధమైనా నిలబడాలంటే ఒకరిపై ఒకరికి స్పష్టమైన అవగాహన ఉండాలి. తప్పు చేసినప్పుడు, అది ఎవరైనా సరే గట్టిగా నిలదీసే ధైర్యం సమాజానికి ఉండాలి. మోసం చేసిన వాడు సమాజంలో తలెత్తుకోలేకుండా ఉండే వాతావరణం రావాలి.

**ముగింపు: మన బాధ్యత**

మత్తు పదార్థాల వాడకం ఒక వ్యసనమైతే, ఎదుటివారిని మోసం చేయడం అనేది నేడు ఒక సంస్కృతిగా మారుతోంది. డ్రగ్స్ కంటే మోసమే నయం అని ఒక వ్యక్తి భావించే స్థాయికి సమాజం చేరుకుందంటే, మనం ఎంతటి విలువల సంక్షోభంలో ఉన్నామో అర్థం చేసుకోవచ్చు.

మనిషిని మనిషిగా ప్రేమించే, నమ్మే రోజులు మళ్లీ రావాలి. మన పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి డబ్బో, హోదానో కాదు... 'నమ్మకం' అనే గొప్ప సంస్కారం కావాలి. లేదంటే ఈ 'నమ్మకద్రోహం' అనే విషం మత్తు పదార్థాల కంటే వేగంగా మానవ నాగరికతను సమాధి చేస్తుంది.



**బిర్రు కరుణాకర్**

జర్నలిస్ట్ వార్త సి ఈ ఓ ,సీనియర్ జర్నలిస్ట్

# ప్రకృతి ప్రేమికుడు దుశ్శర్లపై గొర్రెల కాపరుల దాడి

**సూర్యాపేట జిల్లా రాఘవాపురంలో ఘటన**

**అడవిలో గొర్రెలు మేపొద్దన్నందుకు కర్రలు, రాళ్లతో దాడి**

**తలపై తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స**

**భూమి కోసమే హత్యాయత్నం జరిగిందని ఆరోపణ**



సూర్యాపేట **ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**

ప్రకృతి ప్రేమికుడు, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్శర్ల సత్యనారాయణపై గొర్రెల కాపరులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దాడిలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి.రాఘవాపురంలో తనకున్న 70 ఎకరాల భూమిలో దుశ్శర్ల సత్యనారాయణ ఎన్నో ఏళు ్లగా మొక్కలను పెంచి దాన్ని ఒక దట్టమైన అడవిగా మార్చారు. గురువారం ఆయన లేని సమయంలో కొందరు గొర్రెల కాపరులు తమ గొర్రెలను ఆ అడవిలో మేపుతూ చెట్ల కొమ్మలను నరుకుతున్నారు. గురువారం రాఘవాపురానికి చెందిన గొర్రెల కాపర్లు బయ్య గంగయ్య, మల్లయ్య ఆ అడవిలో చెట్లు నరుకుతూ, గొర్రెలను మేపుతూ కనిపించారు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన సత్యనారాయణ తన అడవిలో గొర్రెలను ఎందుకు మేపుతున్నారని వారిని ప్రశ్నించారు.

ఈ క్రమంలో మాటామాటా పెరిగి, గొర్రెల కాపరులు కర్రలు, రాళ్లు, గొడ్డళ్లతో ఆయనపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు.

"మా ఇష్టం, ఇక్కడే మేపుతాం" అని బెదిరించి తనపై దాడి చేశారని సత్యనారాయణ తెలిపారు. తన 70 ఎకరాల అడవిని ఆక్రమించుకునేందుకే పథకం ప్రకారం తనపై హత్యాయత్నం చేశారని ఆయన ఆరోపించారు. తనకు రక్షణ కల్పించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్య : బండి సంజయ్

**ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీలు వేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శ**

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారని వెల్లడి**

నర్సంపేట **ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**




నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీలు వేసి మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారని చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లలో న్యాయం ఉందని బండి సంజయ్ అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు బీజేపీ మద్దతు పలుకుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యకు పాల్పడి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, రెండు పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లిస్తామని కాంగ్రెస్ తన 'అభయహస్తం' హామీల జాబితాలో పేర్కొందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తామని కూడా చెప్పిందని గుర్తు చేశారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

**90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నద్ధం**

**రాష్ట్రవ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం**

**అధికారులతో ఇరిగేషన్, సవిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష**




హైదరాబాద్: **ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణా వసతిని ఏర్పాటు చేయాలని -రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని, సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ వార్తలు వార్తల ఆర్కైవ్ జ్యోతిష్య సేవలు ఆన్‌లైన్‌రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు, జనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు, ఫైనాన్స్, మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట

**2011 మిలియన్ మార్చ్ కేసులను కొట్టివేసిన హైకోర్టు**



హైదరాబాద్: **ఏప్రిల్ 24 (జర్నలిస్ట్ వార్త):**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2011లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌కు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది.నాడు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో వీరికి ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం వారిపై నమోదైన కేసులను కొట్టివేసింది.